## 40శాతం కూడా రుణమాఫీ కాలే

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 : అంకెల గారడీతో రైతులను సీఎం రేవంత్‌రెడ్డి బురిడీ కొట్టిస్తున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 40శాతం కూడా రుణమాఫీ కాలేదన్నారు.

### అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్: మాజీ ఎమ్మెల్యే సుంకె



అబద్ధాలకు రేవంత్‌రెడ్డి అంబాసిడర్‌గా మారారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎద్దేవాచేశారు. పూడూరులో 680 మంది రైతులుంటే, 142 మందికి మాత్రమే మాఫీ అయినట్టు వివరించారు.

### దేవుళ్లపై ఒట్టేసి రైతులకు మోసం: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి మరీ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్‌లో మండిపడ్డారు.

### రుణమాఫీపై చేతులెత్తేసిన సర్కార్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్, ఆగస్టు 16 : రుణమాఫీ చేయక రేవంత్ సర్కార్ చేతులెత్తేసిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని తన నివాసంలో మాట్లాడారు.

### తుపాకీ రాముడి మాటలు బంజెయ్: పుట్ట మధూకర్



పెద్దపల్లి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ) : ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి తుపాకీ రాముడి ముచ్చట్లు బంద్ చేయాలని మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, కోరుకంటి చందర్ హితవుపలికారు. శుక్రవారం పెద్దపల్లి బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు.

### హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఇక ముందు హరీశ్‌రావు జోలికొస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం సంగారెడ్డిలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, చంటి క్రాంతికిరణ్‌తో కలిసి మాట్లాడారు.

### హరీశ్‌రావు వీడియోను ప్రదర్శించిన చంటి క్రాంతికిరణ్



రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాలు చేసిన వీడియోను విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రదర్శించారు. ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ అమలుచేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ సవాల్ చేశారని కాంత్రికిరణ్ వివరించారు.

### రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



నార్కట్‌పల్లి, ఆగస్టు 16 : రుణమాఫీ అమలులో విఫలమైన రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలని మాజీ ఎమ్మెల్యే లింగయ్య డిమాండ్ చేశారు.

### కేసీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి



మిర్యాలగూడ, ఆగస్టు 16 : కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి మిర్యాలగూడలో విమర్శించారు.


# కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు అస్వస్థత అంటూ తప్పుడు కథనాలు వ్యాప్తి
- పార్టీ క్యాడర్‌తో, వ్యవసాయ పనులతో నిత్యం కేసీఆర్ బిజీబిజీ
- 12 రోజులుగా అస్వస్థత అయితే నేతలను ఎలా కలుస్తున్నరు?

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితిపై కాంగ్రెస్ దుష్ప్రచారానికి పాల్పడుతున్నది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న కేసీఆర్‌పై తీవ్ర అస్వస్థత ముద్రవేసే పన్నాగానికి తెరతీసింది. నిత్యం పార్టీ శ్రేణులతో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరుపుతూ, వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులతో బిజీబిజీగా గడుపుతున్న నేతకు అనారోగ్యం అంటూ దుష్ప్రచారానికి దిగింది. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌కు తీవ్ర అస్వస్థత అంటూ ప్రచారం చేస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా 12 రోజులుగా కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారని, యశోద దవాఖాన బృందం గజ్వేల్‌లో ఎమర్జెన్సీ యూనిట్‌ను నెలకొల్పి 24 గంటలు పర్యవేక్షిస్తున్నదని ప్రచారం చేస్తున్నది.

**12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే...**

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్ కుటుంబ సమేతంగా బుధవారం కేసీఆర్‌ను కలిసి, తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కేసీఆర్ 12 రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైతే ఇవి సాధ్యపడ్తాయా? అని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.



మాజీ సీఎం కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

# కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష

- కులగణన చేయకుంటే ఊరుకోం
- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- బీసీ సంఘాల నేతల స్పష్టీకరణ
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందే
- ఆర్ కృష్ణయ్య, రాజారాంయాదవ్ డిమాండ్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, ఆగస్టు 16: బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష చేపడుతామని బీసీ సంఘాల నాయకులు స్పష్టంచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. కులగణన చేయకుండా ప్రభుత్వం సాకులు చెబితే ఊరుకునే ప్రసక్తే లేదని ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. తన ఆరోగ్యం బాగాలేకున్నా సామూహిక ఆమరణ దీక్షలో పాల్గొంటానని చెప్పారు. అధికార పార్టీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు సమగ్ర కులగణనపై ఆయా పార్టీలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నదని హితవు పలికారు. 42 మంది బీసీ నేతలతో సామూహిక ఆమరణ దీక్ష చేపడుతామని చెప్పారు.

## అసమానతలు తగ్గించటానికి వర్గీకరణ తోడ్పాటు: పొన్నాల

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణ దోహదం చేస్తుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం స్ఫూర్తివంతమైనదని తెలిపారు. ఆయన పోరాటం ఫలించిందని చెప్పారు. హైదరాబాద్‌లోని పొన్నాల లక్ష్మయ్య నివాసానికి శుక్రవారం మందకృష్ణ వెళ్లారు. మర్యాద పూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు.

**GMR HYDERABAD AIR CARGO**
(A Division of GMR Air Cargo and Aerospace Engineering Limited)
Air Cargo Terminal, Rajiv Gandhi International Airport (RGIA), Shamshabad, Hyderabad-500108.

**IMPORT CARGO E-AUCTION**

This notice is for auction of Uncleared Imported cargo at **Air Cargo Complex, RGIA,** Shamshabad, through e-Auction by MSTC LTD. (A Govt. of India Enterprise) under E.A.No.: 22148.

**Note:** Re-Auction of Rejected lots will be communicated in MSTC website, Bidders are advised to keep checking website for Auction Dates.

Visit
www.mstcindia.co.in
www.mstcecommerce.com
Contact: Smt. Suraiya R Shaik, (Manager-MSTC),
7406047869, 040-23301079 for further details
Sd/- AGM-Quality & Compliance.




# రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి

- మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్



మాట్లాడుతున్న బాల్క సుమన్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : 'కేసీఆర్, హరీశ్‌రావుతో నీకు పోలికా? ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు మాట్లాడు' అంటూ రేవంత్‌రెడ్డిపై మాజీ ఎంపీ బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. హరీశ్‌రావుపై రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా మాట్లాడారు. రుణమాఫీ మోసాన్ని పక్కదారి పట్టించేందుకే కేసీఆర్, హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, భరతం పడతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి దావోస్, అమెరికా పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 4వేల పింఛన్ ఇవ్వనందుకు, స్కూటీలు ఇవ్వనందుకు, రైతులను వంచించినందుకు, ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు రేవంత్‌రెడ్డే నీళ్లలో దూకాలని దుయ్యబట్టారు. అంబేద్కర్‌ను రేవంత్‌రెడ్డి అవమానిస్తున్నాడని, నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ అతిపెద్ద విగ్రహం వద్ద వసతులు కల్పించకుండా వదిలేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిది నడుమంత్రపు సిరి అని, జాక్‌పాట్‌లో సీఎం అయ్యారని, ఇదే ఆయనకు చివరి పదవి అని, భవిష్యత్తులో ఇక ఏ పదవీ వచ్చేది లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే పనితీరులో పోటీ పడాలని సూచించారు. బీఆర్‌ఎస్ ఏ పార్టీలో విలీనం కాదని, బలమైన పార్టీ అని, మరో 50 ఏండ్లు బలంగా ఉండేందుకు పార్టీ నాయకత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. త్వరలోనే బలమైన ప్రాంతీయ పార్టీలున్న రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అధ్యయనం చేస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో శాట్స్ మాజీ చైర్మన్ అంజనేయగౌడ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బాలు పాల్గొన్నారు.

